
నమస్తే తెలంగాణ
# జిందగీ
ఆదివారం | 1 జూన్ 2025
హైదరాబాద్ | www.ntnews.com
11



## ఆమెకు ఆసక్తిలేదు..

ప్రస్తుతం బాలీవుడ్‌లో స్టార్‌కిడ్స్ హవా నడుస్తున్నది. అగ్రతారల వారసుల అరంగేట్రం జోరుగా సాగుతున్నది. అందులోనూ తల్లుల వారసత్వాన్ని కొనసాగిస్తూ.. టాప్ హీరోయిన్ల కూతుళ్లు బీటౌన్‌లో సత్తా చాటుతున్నారు. ఇప్పటికే శ్రీదేవి కూతుళ్లు జాన్వీ, ఖుషీతోపాటు రవీనా టాండన్ తనయ రాశా తడానీ బాలీవుడ్‌లో అడుగుపెట్టి.. రఫ్ఫాడిస్తున్నారు. ఈక్రమంలో కాజోల్, అజయ్ దేవ్‌గణ్ దంపతుల కుమార్తె నైసా దేవ్‌గణ్‌పై బీటౌన్ మీడియా ఫోకస్ పెట్టింది. ఆమె బాలీవుడ్ అరంగేట్రం ఎప్పుడా ? అని ఎదురుచూస్తున్నది. తాజాగా, కాజోల్ రాబోయే చిత్రం 'మా' ట్రైలర్ లాంచ్ సందర్భంగా.. నైసా బాలీవుడ్ ఎంట్రీపై మళ్లీ చర్చ మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరైన అజయ్‌ను మీడియా ప్రతినిధులు ఇదే విషయంపై ప్రశ్నించగా.. ఆయన ఒక్కమాటతోనే నైసా కెరీర్‌పై స్పష్టతనిచ్చాడు. 'ప్రస్తుతమైతే నైసాకు ఇండస్ట్రీలోకి రావడానికి ఆసక్తిలేదు!' అంటూ.. చర్చకు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. ఇక 'మా' సినిమా విషయానికి వస్తే.. తన కూతురిని దెయ్యం చెరనుంచి విడిపించుకునేందుకు ఓ తల్లి చేసే పోరాటమే ఈ చిత్రం. విజువల్ ఫీస్ట్‌గా రాబోతున్న ఈ హారర్ చిత్రంలో కాజోల్ ప్రధానపాత్ర పోషిస్తున్నది. జియో స్టూడియోస్‌తో కలిసి అజయ్ దేవ్‌గణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. విశాల్ పూరియా దర్శకత్వం వహించాడు. రోనిత్ రాయ్, సుభద్ర సేన్ గుప్త, ఇంద్రనీల్, జితిన్ జ్యోతి గులాటీ కీలక పాత్రల్లో నటించారు. జూన్ 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నది.






భారీ తారాగణం ఎంతున్నా.. సినిమాకు కెప్టెన్ అంటే డైరెక్టరే! ఆయన యాక్షన్ అనగానే నటించాలి. కట్ అనగానే ఆపేయాలి. ఎలా చెప్తే హీరోలు అలా వినాల్సిందే! 'షాట్ ఒకే!!' అనే వరకూ 'వన్ మోర్!!' చేయాల్సిందే!! మరి ఆయనకు ఆయనే యాక్షన్ అనుకుంటే! టేకింగ్ అదిరిపోతుందంతే!! అలా ఎందరో హీరోలు దర్శకులుగా అవతారమెత్తి.. ప్రేక్షకులకు వినోదం పంచారు. స్వీయ దర్శకత్వంలో అద్భుతాలు సృష్టించారు. స్టార్ హీరోలుగా, టాప్ డైరెక్టర్లుగా పేరొంది.. ఈ తరం దర్శకులకు టార్చ్ బేరర్స్‌గా నిలిచారు!!


# ఈ స్టార్ హీరోలు సూపర్ డైరెక్టర్లు

'నా సినిమాల్లో స్క్రీన్ ప్లే అలా ఉండటానికి కారణం ఆయనే! 'ఓం', 'A', 'ఉపేంద్ర' చిత్రాలతోనే నేను వైవిధ్యమైన స్క్రీన్ ప్లే నేర్చుకున్నాను. నేను ఆ విషయాన్ని ఉపేంద్ర గారి నుంచి దొంగిలించాను కాదు, తస్కరించాను! నేను సహాయ దర్శకుడిగా ఉన్నప్పుడే యాక్షన్ కింగ్ అర్జున్ గారిని దగ్గర నుంచి చూశాను. తన సర్వస్వాన్ని ధారపోసి యాక్టర్ కమ్ డైరెక్టర్‌గా ఎదిగారు!'– ఇలా అన్నది ఎవరో కాదు, డైరెక్టర్ సుకుమార్. అర్జున్ దర్శకత్వంలో వస్తున్న 'సీతా పయనం' సినిమా టీజర్ లాంచ్‌లో డైరెక్టర్లుగా మారిన యాక్టర్ల గురించి ప్రస్తావించారు సుకుమార్. హీరోగా, దర్శకుడిగా రాణించిన అర్జున్, ఉపేంద్ర క్లాసిక్ కల్ట్ మూవీస్‌ను గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలో డైరెక్టర్లకు డిక్టేషన్ చెప్పిన మన డైరెక్టర్ కమ్ యాక్టర్స్ విశేషాలు ప్రస్తావించుకుందాం.



**తెలుగు** సినిమా తొలి తరం నటుడు చిత్తూరు నాగయ్య. నటనకు కొలమానం నిర్దేశించిన ఆయన పలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. సంగీత దర్శకుడిగా, గాయకుడిగానూ రాణించారు. నిర్మాతగా మేలు రత్నాల్లాంటి చిత్రాలను అందించారు. నాగయ్య తర్వాత దర్శకుడిగా ఎనలేని కీర్తి గడించిన స్టార్ హీరో ఎన్టీఆర్. 'సీతారామకళ్యాణం' సినిమాతో దర్శకుడిగా అవతారమెత్తారు ఎన్టీఆర్. రామాయణంలోని విలన్ రావణుడిని కథానాయకుడిగా చేసి చూపించిన ఈ చిత్రం ఎన్టీఆర్‌లోని వైవిధ్యాన్ని చాటిచెప్పింది. ఆ తర్వాత కూడా ఎన్టీఆర్ డజన్ వరకు చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. శ్రీకృష్ణ పాండవీయం, వరకట్నం, తల్లా? పెళ్లామా?, తాతమ్మ కల, దాన వీర శూర కర్ణ, చాణక్య చంద్ర గుప్త, శ్రీరామ పట్టాభిషేకం, శ్రీమద్విరాటపర్వం, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, చండశాసనుడు, బ్రహ్మర్షి విశ్వామిత్ర, సామ్రాట్ అశోక ఇలా ఎన్నో సినిమాలు ఆయన హీరోగా నటిస్తూనే, దర్శకత్వం వహించారు. ఎన్టీఆర్ డైరెక్ట్ చేసిన 'దాన వీర శూర కర్ణ' సినిమాలో కృష్ణుడిగా, దుర్యోధనుడిగా, కర్ణుడిగా త్రిపాత్రాభినయం చేసి మెప్పించారు. తర్వాత వచ్చిన 'శ్రీమద్విరాటపర్వం' సినిమాలో ఏకంగా ఐదు పాత్రలు (కృష్ణుడు, అర్జునుడు, బృహన్నల, కీచకుడు, దుర్యోధనుడు) పోషించి అదరహో అనిపించారు. ఇండస్ట్రీలో తనకు సమ ఉజ్జీగా భావించే ఏయన్నార్‌ను కూడా డైరెక్ట్ చేశారు ఎన్టీఆర్.

**ఎన్టీఆర్** తర్వాత దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన పెద్ద హీరో కృష్ణ. ఆయన కెరీర్‌లో మైలురాయిగా చెప్పుకొనే 'అల్లూరి సీతారామరాజు' సినిమాకు కొన్నాళ్ల షూటింగ్ తర్వాత అనుకోకుండా డైరెక్షన్ చేయాల్సి వచ్చింది. ఆ సినిమా ఎంత విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 1986లో వచ్చి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన 'సింహాసనం' సినిమాకు దర్శకత్వం వహించింది ఆయనే. కాళీదాదా, శంఖారావం, ముగ్గురు కొడుకులు, కలియుగ కర్ణుడు ఇలా పదికిపైగా సినిమాలకు కృష్ణ దర్శకత్వం చేపట్టారు. పద్మాలయ స్టూడియోస్ పతాకంపై ఎన్నో చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. ఎన్టీఆర్, కృష్ణ జమానా నుంచి మొదలైన హీరో కమ్ డైరెక్టర్ ట్రెండ్ ఇప్పటికీ కొనసాగుతున్నది. కమల్ హాసన్, పవన్ కళ్యాణ్, ధనుష్, విశ్వక్‌సేన్, సిద్ధార్థ్ ఇలా నటులుగా, దర్శకులుగా తమ సృజనాత్మకతను నిరూపించుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి పూర్తిస్థాయి దర్శకుడిగా మారకపోయినా.. ఆయన చేసిన కొన్ని సినిమాల్లో పలు సన్నివేశాలకు దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన సందర్భాలు చాలానే ఉన్నాయి.



### పాన్-ఇండియా స్ఫూర్తి

'హీరోగా తెరపై మెరవడం ఒక కళ అయితే, దర్శకుడిగా కథను తెరకెక్కించడం అంతకుమించిన ఆర్ట్!' అంటారు సినీ విమర్శకులు. పాన్–ఇండియా స్థాయిలో హీరో కమ్ డైరెక్టర్‌గా మెప్పించిన వారిలో కమల్ హాసన్ ముందు వరుసలో ఉంటారు. 'హే రామ్', 'చాచీ 420', 'పోతురాజు', 'విశ్వరూపం' లాంటి చిత్రాలతో హీరో–దర్శకుడిగా తన సత్తా చాటారు. స్ఫూర్తిదాయక, సామాజిక సందేశాత్మక కథలను చెప్పాలనే ఉద్దేశం కమల్‌ను దర్శకుడిగా మార్చింది. తర్వాత యాక్షన్ కింగ్ అర్జున్, కన్నడ హీరో ఉపేంద్ర పేర్లు వినిపిస్తాయి. అర్జున్ కన్నడ, తమిళ, తెలుగు సినిమాల్లో హీరోగా మెరిసి, దర్శకుడిగా కూడా తన సత్తా చాటారు. 'సేవగన్', 'జైహింద్', 'మద్రాసి'.. లాంటి చిత్రాలతో దర్శకుడిగా, రచయితగా గుర్తింపు పొందారు. ఇప్పుడు 'సీతా పయనం'తో తన కుమార్తె ఐశ్వర్య, నిరంజన్ జంటగా ఒక ప్రేమకథా చిత్రాన్ని రూపొందించారు. ఇక కల్ట్ సినిమాలకు కేరాఫ్‌గా మారిన ఉపేంద్ర గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఉపేంద్ర కన్నడ సినిమాలో 'A', 'ఉపేంద్ర' లాంటి ప్రయోగాత్మక చిత్రాలతో సంచలనం సృష్టించారు. తెలుగులో 'రా'తో ఆకట్టుకున్న ఉపేంద్ర, సామాజిక సందేశాలు, కొత్త కథన శైలితో యువతను ఆలోచింపజేశారు.

### పవర్ స్టార్ ప్రయోగాత్మకంగా..

కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు తనదైన శైలిలో కథను చెప్పే ప్రయత్నం చేశారు పవన్ కళ్యాణ్. మార్షల్ ఆర్ట్స్‌ను బ్యాక్‌డ్రాప్‌గా చేసుకుని 'జానీ' సినిమాతో ఓ ఎమోషనల్ ప్రేమ కథను చెప్పే ప్రయత్నం చేశారు. కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్‌లో ప్రత్యేకత చూపారు. ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర పెద్దగా విజయం సాధించలేకపోయినా, పవన్ టేస్ట్‌ను పరిచయం చేసింది. ఇప్పుడు వస్తున్న యంగ్ హీరోల్లో విశ్వక్‌సేన్ తనలోని డైరెక్టర్ కమ్ హీరోని నేటి తరానికి చూపించే ప్రయత్నం చేశారు. 'ఫలక్‌నామా దాస్'తో హీరోగా, దర్శకుడిగా కొత్త కథను చెప్పారు. ఈ చిత్రం మిశ్రమ స్పందన పొందినా, విశ్వక్ దర్శకత్వం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. 'నాకు సినిమా అంటే కేవలం నటన కాదు, కథ చెప్పడంలోనూ భాగం కావాలనుకుంటాను' అని విశ్వక్ ఓ సందర్భంలో ప్రేక్షకులతో పంచుకున్నారు. తమిళ సినిమాలో ఆర్.మాధవన్ 'రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్'తో దర్శకుడిగా మారారు. ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవిత కథను అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతోపాటు.. జాతీయ అవార్డుల రేసులో నిలిచింది. హిందీ సినిమాల్లోనూ హీరోలు దర్శకత్వం వైపు మళ్లడం చూస్తున్నాం. మొత్తంగా చాలామంది స్టార్ హీరోలు సూపర్ డైరెక్టర్లుగా పేరు తెచ్చుకున్నారు. కొందరు ఒకట్రెండు సినిమాలే డైరెక్ట్ చేసినా.. ఒక ట్రెండ్ సృష్టించారు. ఈ ఒరవడి ఇలాగే కొనసాగాలని ఆశిద్దాం!

### తొలితరం నుంచే..

**ఈ** ట్రెండ్ బాలీవుడ్‌లో బ్లాక్ అండ్ వైట్ రోజుల నుంచీ ఉన్నదే! వి.శాంతారామ్, గురుదత్, రాజ్ కపూర్, దేవానంద్ ఇలా సూపర్‌స్టార్లు ఎందరో దర్శకులుగా రాణించారు. నిన్నటి తరానికి వస్తే ఆమిర్‌ఖాన్ పేరు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయన దర్శకత్వం వహించిన 'తారే జమీన్ పర్' అద్భుతమైన సినిమాగా ప్రేక్షకుల ఆదరణ పొందింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ హృతిక్ రోషన్ 'క్రిష్ 4'తో మెగాఫోన్ పట్టుకోనున్నట్లు ప్రకటించడం విశేషం.



## హ్యూమర్ + హ్యూమానిటీ

### టూరిస్ట్ ఫ్యామిలీ

ఓటీటీ హిట్

**జియో+ హాట్‌స్టార్:** జూన్ 2 నుంచి
**తారాగణం:** శశి కుమార్, సిమ్రన్, యోగిబాబు, మిథున్ జైశంకర్, రమేశ్ తిలక్, భగవతి పెరుమాల్ తదితరులు, **దర్శకత్వం:** అభిషాన్ జీవింత్

మనిషి సంఘజీవి. అలాంటి మనిషి.. సమాజంలో ఎలా బతకాలి? అసలు ఓ సగటు మనిషి జీవితం ఎలా ఉండాలి? తోటివారితో కలిసి ఎలా జీవించాలి? ఒకరికి ఒకరు ఎలా అండగా నిలవాలి? అనే అంశాల్ని స్పృశిస్తూ సాగే చిత్రం.. టూరిస్ట్ ఫ్యామిలీ.

**కథలోకి వెళ్తే..** శ్రీలంకకు చెందిన తమిళ దంపతులు.. ధర్మదాస్ (శశి కుమార్) – వాసంతి దాస్ (సిమ్రన్). వీరికి ఇద్దరు కొడుకులు. అక్కడి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి.. స్థానికులకు కష్టాలు, సమస్యలు ఎదురవుతాయి. ఈ క్రమంలో మెరుగైన భవిష్యత్ కోసం ధర్మదాస్ తన కుటుంబంతో భారత్‌కు అక్రమంగా వలస వస్తాడు. వాసంతి అన్న అయిన ప్రకాశ్ (యోగి బాబు) ప్రోత్సాహంతో.. చెన్నైలోని ఒక కాలనీలో అద్దె ఇంట్లో దిగుతాడు. అయితే, ఆ కాలనీవాళ్లంతా ఉరుకులు – పరుగుల జీవితానికి అలవాటు పడిపోయిన వాళ్లే! రకరకాల సమస్యలతో జీవితం వెళ్లదీస్తూ, పక్కింట్లో ఏం జరుగుతుందో కూడా పట్టించుకోలేని పరిస్థితుల్లో ఉంటారు. ఇలాంటి కాలనీ అయితేనే తన బావ కుటుంబం సురక్షితంగా ఉంటుందని ప్రకాశ్ భావిస్తాడు. అంతేకాదు.. చుట్టుపక్కల వారు ఎవరు పలకరించినా మాట్లాడవద్దని తనవాళ్లకు చెబుతాడు. అయితే.. ధర్మదాస్ కుటుంబ సభ్యులు అందుకు భిన్నంగా ప్రవర్తిస్తారు. ఆ కాలనీవాళ్లతో బాగా కలిసిపోతారు. మరి.. ధర్మదాస్ కుటుంబం కారణంగా ఆ కాలనీలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి? కాలనీవాసులు మర్చిపోతున్న మానవత్వాన్ని.. దాస్ ఎలా గుర్తు చేశాడు? బాంబ్ బ్లాస్ట్‌కు కారణమంటూ.. పోలీసులు దాస్ కుటుంబాన్ని ఎందుకు వెతుకుతుంటారు? నిజంగానే వీళ్లు బాంబ్ బ్లాస్ట్‌కు కారణమా? పోలీసులకు దొరికారా? చివరికి ఏం జరిగింది అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే!




కేవలం రూ.8 కోట్లతో నిర్మించిన ఈ చిత్రం.. ప్రపంచవ్యాప్తగా రూ.80 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. తమిళ ఇండస్ట్రీకి ఓ మంచి కమ్‌బ్యాక్‌గా నిలిచింది. దర్శకధీరుడు రాజమౌళి, నాని, సూర్య లాంటి సినీ ప్రముఖుల ప్రశంసలు అందుకున్నది. అలాంటి సినిమా.. ఇప్పుడు ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఈ చిత్రంలోని ప్రతీ సన్నివేశం మనసును హత్తుకుంటుంది. చూస్తున్నంతసేపూ గుండెను బరువెక్కిస్తుంది. నవ్విస్తూ, ఆలోచింపజేస్తూ, మనసుల్ని తడిమేస్తూ, గుండెల్ని తడిచేస్తూ సాగుతుంది. ఎక్కడా బోర్ కొట్టకుండా.. 'అప్పుడే అయిపోయిందా!?' అనే ఫీల్‌గుడ్ సినిమా ఇది. రొడ్డ కొట్టుడు సినిమాలతో మొహం వాచిపోయిన అభిమానులకు 'టూరిస్ట్ ఫ్యామిలీ' కొత్త అనుభూతిని పంచుతుంది.

## మిస్ యూ ఇర్ఫాన్!

విలక్షణ నటుడు ఇర్ఫాన్ ఖాన్‌ను చాలా మిస్ అవుతున్నట్లు చెబుతున్నది బాలీవుడ్ నటి కొంకణా సేన్ శర్మ. 'మెట్రో.. ఇన్ దినో' షూటింగ్ సమయంలో ఇర్ఫాన్ ఎంతగానో గుర్తుకొచ్చాడంటూ చెప్పుకొచ్చింది. అనురాగ్ బసు దర్శకత్వంలో వస్తున్న మ్యూజికల్ చిత్రం 'మెట్రో.. ఇన్ దినో'లోని మొదటి పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా కొంకణాసేన్ మాట్లాడుతూ.. బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నది. 'ఇర్ఫాన్‌ను మర్చిపోవడానికి ఓ జీవితం పడుతుంది' అంటూ కన్నీటి పర్యంతమైంది. 2007లో అనురాగ్ దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ కామెడీ చిత్రం.. 'లైఫ్ ఇన్ ఎ మెట్రో'. ఇందులో ఇర్ఫాన్ ఖాన్, కొంకణాసేన్ శర్మ జంటగా నటించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గానే 'మెట్రో.. ఇన్ దినో' వస్తున్నది. మొదటి భాగంలో ఇర్ఫాన్ – కొంకణా జంటతోపాటు ధర్మేంద్ర, కంగనా రనౌత్, శర్మన్ జోషీ, శిల్పాశెట్టి, సారా అలీఖాన్, కేకే మేనన్ లాంటి అగ్రతారలు నటించారు. వీరిలో రెండోభాగంలో నటిస్తున్నది కొంకణాసేన్ మాత్రమే! ''మెట్రో.. ఇన్ దినో'లో ఓ సన్నివేశాన్ని చిత్రీకరించేటప్పుడు అసంకల్పితంగానే నా కళ్లనుంచి నీళ్లు కారిపోయాయి. ఆ సీన్‌కు ప్రీక్వెల్‌లోని ఓ సన్నివేశానికి లింక్ ఉంటుంది. పాత సీన్‌లో నేను, ఇర్ఫాన్ కలిసి నటించాం. అందుకే.. ఆయనే పదేపదే గుర్తుకొచ్చారు. ఇర్ఫాన్‌ను చాలా మిస్ అవుతున్నాను' అంటూ చెప్పుకొచ్చింది. బాలీవుడ్ సీనియర్ దర్శకురాలు, నటి అపర్ణా సేన్ వారసులిగా ఇండస్ట్రీలోకి వచ్చింది కొంకణా సేన్. బెంగాలీ, హిందీతోపాటు హాలీవుడ్ సినిమాలతో ప్రేక్షకులను మెప్పించింది. టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్‌ల్లోనూ నటించింది. దర్శకురాలిగానూ ప్రతిభ చాటుకున్నది. రెండు జాతీయ చలనచిత్ర అవార్డులతోపాటు నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను అందుకుంది. ఇక ఇర్ఫాన్ ఖాన్ విషయానికి వస్తే.. సహజత్వం ఉట్టిపడేలా, వైవిధ్య భరితమైన పాత్రలతో ప్రేక్షకుల మదిలో చెరగని ముద్రవేశాడు. 'సలామ్ బాంబే'తో పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఇర్ఫాన్.. బాలీవుడ్‌తోపాటు హాలీవుడ్‌లోనూ సత్తా చాటాడు. స్లమ్‌డాగ్ మిలియనీర్, ఎ మైటీ హార్ట్, జురాసిక్ వరల్డ్, లైఫ్ ఆఫ్ పై లాంటి సినిమాలతో మంచిపేరు సంపాదించుకున్నాడు. మహేశ్‌బాబు హీరోగా వచ్చిన 'సైనికుడు'తో టాలీవుడ్‌కూ పరిచయమయ్యాడు. విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఇర్ఫాన్.. క్యాన్సర్, పెద్దపేగు ఇన్ఫెక్షన్ కారణంగా 2020లో మృతిచెందాడు.



## షారుక్ చెంప చెళ్లుమనిపించా

చేసింది కొన్ని సినిమాలే అయినా.. ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటి ప్రియాగిల్. బాలీవుడ్‌లో సిర్ఫ్ తుమ్, జోష్ లాంటి బ్లాక్‌బస్టర్ సినిమాల్లో.. తన అందం, అభినయంతో ఆకట్టుకున్నది. 'బాగున్నారా', 'రాయలసీమ రామన్న చౌదరి' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులనూ పలకరించింది. అయితే.. తన సినీ కెరీర్‌లోనే షారుక్‌ను చెంపదెబ్బ కొట్టే సీన్ కోసం చాలా ఇబ్బంది పడ్డట్లు చెప్పుకొచ్చింది. 2000 సంవత్సరంలో షారుక్ ఖాన్ హీరోగా వచ్చిన రొమాంటిక్ యాక్షన్ డ్రామా 'జోష్'లో మెరిసింది ప్రియ. ఈ సినిమాలోని ఒక సీన్‌లో ఆమె షారుక్‌ను చెంపదెబ్బ కొడుతుంది. ఆ షాట్ కోసం తానుపడ్డ ఇబ్బందులు, తదనంతర పరిణామాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నది. 'గోవాలో జోష్ సినిమా షూటింగ్. అందులో ఓ సన్నివేశంలో నేను షారుక్‌ను చెంపదెబ్బ కొట్టాలి. అప్పటికే ఆయన పెద్దస్టార్. అలాంటి అగ్రస్థాయి నటుణ్ని చెంపదెబ్బ ఎలా కొట్టాలా? అని నేను ఎంతో టెన్షన్‌గా ఫీలయ్యా! డైరెక్టర్ మన్సూర్ మాత్రం.. 'ఏం ఫర్వాలేదు కొట్టేయ్!' అని అన్నారు. షారుక్ కూడా ఫర్వాలేదని చెప్పారు. దాంతో.. బాద్‌షా చెంపపై ఒక్క దెబ్బవేశా!' అంటూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నది. ఆ షాట్ తర్వాత సెట్ మొత్తం ఒక్కసారిగా సైలెంట్ అయ్యిందట. 'నాకింకా గుర్తు.. షారుక్‌ను కొంచెం గట్టిగానే కొట్టా. దానికి షారుక్ ఇచ్చిన రియాక్షన్ చూసి.. డైరెక్టర్ కట్ చెప్పడం కూడా మర్చిపోయారు. షాట్ పూర్తయినా కెమెరా తిరుగుతూనే ఉంది. ఆ సంఘటనను నేనెప్పటికీ మర్చిపోలేను' అంటూ చెప్పుకొచ్చింది. ఆ తర్వాత షారుక్.. 'నువ్వు నన్ను కొట్టావ్ కదా!' అని కాసేపు ప్రియను ఏడిపించాడట. సినిమా కెమెరామెన్‌గా పనిచేసిన కేవీ.. 'నువ్వు షారుక్‌ను కొట్టినందుకు అమ్మాయిలు నిన్ను ద్వేషిస్తారు' అని తనతో అన్నట్లు గుర్తుచేసుకున్నది ప్రియా గిల్. 1995 మిస్ ఇండియా పోటీలలో మూడో స్థానంలో నిలిచిన ప్రియా గిల్.. 'తేరే మేరే సప్నే'తో సినీరంగంలోకి అడుగుపెట్టింది. 1996 – 2006 మధ్యకాలంలో హిందీ, తెలుగు, మలయాళం, తమిళ, పంజాబీ చిత్రాలలో నటించింది.



## తోబుట్టువు ఉండాలని

సోషల్ మీడియా వేదికగా తన జీవితానికి సంబంధించిన సంగతులను పంచుకుంటూ ఉంటుంది బాలీవుడ్ హీరోయిన్ శిల్పాశెట్టి కుంద్రా. రెండో బిడ్డ కోసం తాను ఎంతగా, ఎందుకు ఆరాటపడిందన్న సంగతుల్ని పంచుకుంది. 'నా కొడుకు వియాన్‌కు తప్పకుండా తోబుట్టువు ఉండాలని నేను కోరుకునే దాన్ని. మేం కూడా ఇద్దరం. తోబుట్టువు విలువ నాకు తెలుసు. అందుకే రెండో ప్రెగ్నెన్సీకి ప్లాన్ చేశాం. అయితే నాకు అప్లా (యాంటీ ఫాస్ఫోలిపిడ్ యాంటీబాడీస్) అనే ఆటో ఇమ్యూన్ డిజార్డర్ వచ్చింది. నేను నెల తప్పగానే అది రెచ్చిపోయేది. దాని వల్ల శరీరంలో బ్లడ్ క్లాట్స్ ఏర్పడుతుంటాయి. అలా రెండు సార్లు అబార్షన్ అయింది. మిషనరీ ద్వారా ఒక బిడ్డను దత్తత తీసుకునే ప్రయత్నాలు కూడా సఫలం అవలేదు. నాలుగేండ్లు దానికోసం ఎదురు చూశా. దీంతో సరోగసీకి వెళ్లాల్సొచ్చింది. మా పాప సమీషా అలా మా ఇంటికొచ్చింది.' అంటూ చెప్పుకొచ్చింది. ఇక ఈ పిల్లలిద్దరి ముద్దు ముద్దు ఫొటోలను అభిమానులు తెగ లైక్ చేస్తుంటారన్న సంగతి తెలిసిందే.

